
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సిద్దిపేట

5

సోమవారం 4 మార్చి 2024



మల్లన్నకు బండారి, ఒడిబియ్యం తీసుకువస్తున్న భక్తురాలు

పక్కాగా పెస్టిసైడ్స్

ఆన్‌లైన్‌లోకి పురుగుల మందులు విక్రయించే దుకాణాల లైసెన్స్‌లు

- కంపెనీల ప్రిన్సిపల్ సర్టిఫికెట్‌లు కూడా
- గతేడాదే విత్తన, ఎరువుల వివరాలు నమోదు
- నకిలీ ఉత్పత్తుల విక్రయాలకు అడ్డుకట్టపడే అవకాశం



పెస్టిసైడ్స్ లైసెన్స్‌లు ఆన్‌లైన్ చేస్తున్న ఏవో(ఫైల్)

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 3 : రైతులకు సరఫరా అయ్యే విత్తనాలు, ఎరువులు నాణ్యమైనవే ఉండాలనే ఉద్దేశంతో గతేడాది వాటి లైసెన్స్‌లను ప్రభుత్వం ఆన్‌లైన్ చేయించింది. దీంతో ఎరువుల దుకాణానికి సదరు ఫర్టిలైజర్ కంపెనీ 'ఓ-ఫాం' ఉంటేనే విక్రయించడం ప్రారంభమైంది. అలాగే నకిలీ కంపెనీల విత్తనాలకు అడ్డుకట్ట పడినట్లయింది. అయితే, పెస్టిసైడ్స్(పురుగుల మందులు)ను సైతం ఆన్‌లైన్‌లో నమోదు చేసే క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో వాయిదా పడింది. జిల్లాలోని 23 మండలాల్లో 551 పురుగు మందులు విక్రయించే దుకాణాలుండగా, మండల వ్యవసాయాధికారులు ఇటీవల ఆయా మండలాల్లోని పెస్టిసైడ్ షాపులకు వెళ్లి లైసెన్స్, కంపెనీల ప్రిన్సిపల్ సర్టిఫికెట్(పీసీ)ల ఆన్‌లైన్ నమోదును పూర్తిచేశారు. ఇక ఆన్‌లైన్ పెస్టిసైడ్ లైసెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టంతో నకిలీ ఉత్పత్తుల కంపెనీల పీసీలకు చెక్ పడనున్నది. అర్హత గల కంపెనీల పీసీలు మాత్రమే తీసుకోనుండడంతో నకిలీ కంపెనీల బండారం బయటపడనున్నది.

ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేశాం

కమిషనర్ ఆదేశాల మేరకు పురుగుల మందులు విక్రయించే దుకాణాల లైసెన్స్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను పూర్తి చేశాం. దుకాణ పురుగుల మందు విక్రయించేందుకు లైసెన్స్ దుకాణ యజమాని వివరాలు, దుకాణం ఎక్కడ ఉంది, గోదాం ఉంటే దాని వివరాలు, దుకాణం నడిపే వారి వివరాలు, షాపులో విక్రయిస్తున్న పురుగు మందుల కంపెనీల నుంచి ఇచ్చిన పీసీల వివరాలను మండల వ్యవసాయాధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.



భక్తులతో కిక్కిరిసిన గంగిరేగుచెట్టు ప్రాంగణం



మమ్మేలు కొమురెల్లి మల్లన్నా

- ఏడోవారం జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులు
- పట్నాలు రచించి, బోనాల నివేదన
- దర్శనానికి వీవీఐపీ, ఉచిత దర్శన క్యూలైన్లలో బారులు
- భక్తులకు అందుబాటులోకి అభిషేకం లడ్డూ ప్రసాదం

7లో



సామూహిక బోనాలు నివేదిస్తున్న భక్తులు

ఆదివారం అంతే సంగతి!

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అందని వైద్య సేవలు



సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

- ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ అందుబాటులో ఉండని వైద్యులు
- జీజీహెచ్‌లో ఒకే ఎమర్జెన్సీ విభాగం.. హైదరాబాద్‌కు కేసుల రెఫర్
- ఎటు వెళ్లాలో తెలియక రోగులు సతమతం



జీజీహెచ్‌లో తెరుచుకోని ఫార్మసీ

సిద్దిపేట టౌన్, మార్చి 3 : ఆదివారం వచ్చిందంటే చాలు వైద్య సేవల కోసం రోగులు నానా తంటాలు పడాల్సి వస్తున్నది. 24 గంటలు పనిచేయాల్సిన సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)లోనే ఆదివారం వైద్య సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ ఇదే తంతు కొనసాగుతున్నది. దీంతో రోగులకు ఎక్కడికి వెళ్లాలో దిక్కుతోచడం లేదు.

ఇతర జిల్లాల నుంచి ఇక్కడికే..

సిద్దిపేట పట్టణంలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసిన అనంతరం కాలేజీకి అనుబంధంగా నిర్మించిన జీజీహెచ్‌లో అత్యాధునిక సౌకర్యాలను కల్పించారు. మెరుగైన వైద్య సేవలను అందించడంతో జిల్లాతో పాటు పక్క జిల్లాల నుంచి వేలాది సంఖ్యలో రోజు ఇక్కడికి వైద్య సేవల కోసం రోగులు రావడం ప్రారంభమైంది. ప్రతీరోజు జనరల్ వైద్య సేవలు, నెలవారి పరీక్షల కోసం వచ్చే గర్భిణులతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి కిక్కిరిసిపోతుంది.

పర్యవేక్షణ కరువు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలన్న సంకల్పంతో హరీశ్‌రావు గత పాలనలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ప్రత్యేక శ్రద్ధతో ఆస్పత్రిని సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసేవారు. దీంతో పాటు వైద్యాధికారులతో సమీక్షలు జరుపుతూ, అన్నీ రకాల సౌకర్యాలను సమకూర్చారు. ప్రభుత్వం మారడంతో ప్రభుత్వ ఆస్పత్రులపై పర్యవేక్షణ కరువైంది. పలు ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో అధికారులు ఆడింది ఆట, పాడింది పాట అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

బోసిపోయిన జీజీహెచ్

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది వైద్య సేవల దుస్థితి. జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అత్యాధునిక సౌకర్యాలున్నా ఆదివారం వైద్యం అందని ద్రాక్షలాగే మిగిలిపోతోంది. సిద్దిపేట పట్టణంలో కోట్లాది రూపాయలతో నిర్మించిన ఈ 300 పడకల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆదివారం ఎమర్జెన్సీ వార్డులో అత్యవసర సేవలు మినహా, అవుట్ పేషెంట్ (ఓపీ), ఇన్ పేషెంట్ విభాగం ఆదివారం బోసిపోయింది. రోగుల రిజిస్ట్రేషన్ కౌంటరు అయితే తెరుచుకోనేలేదు. ఫార్మసీ కౌంటర్ ఖాళీగానే దర్శనమిచ్చింది. రక్త పరీక్ష కేంద్రంలో ఎవరూ కనిపించలేదు. ఇన్‌పెషెంట్‌లకు వైద్య చికిత్సలు అందించాల్సిన వైద్యులు సకాలంలో రావడం లేదంటూ రోగులు ఆరోపిస్తున్నారు. స్టాఫ్‌నర్సులే వైద్యులుగా మారి డ్యూటీ డాక్టర్లు సూచించిన ప్రిస్క్రిప్షన్ ఆధారంగా మందులను అందజేస్తున్నారని తెలిపారు. సిద్దిపేట ఆసుపత్రిలో 24 గంటల పాటు వైద్యమందించాలంటే షిఫ్టుల వారీగా విధులు నిర్వర్తిస్తే ఆదివారమూ అందుతాయని ఆ శాఖ అధికారులే చెప్పడం గమనార్హం. కానీ, అమలుకు నోచుకోవడం లేదు.

హైదరాబాద్‌కే రెఫర్

జీజీహెచ్‌లో ఒకే ఎమర్జెన్సీ విభాగం ఉన్నది. రాత్రి సమయాల్లో, ప్రత్యేకంగా ఆదివారం రోజున వివిధ ప్రమాదాలకు గురైన వారు, గుండె నొప్పితో బాధపడుతున్న వారు, ఇతర ఎమర్జెన్సీ రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. ప్రాథమిక చికిత్స చేస్తున్న వైద్యులు హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు.



తెరుచుకోని రిజిస్ట్రేషన్ కౌంటర్



సిద్ధిపేటలోని నాసర్‌పురాలో చిన్నారులకు పోలియో చుక్కలను వేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

పల్స్ పోలియో 92.8 శాతం

- జిల్లాలో ఐదేళ్ల లోపు చిన్నారులు 93,667 మంది
- 86,245 మందికి పోలియో చుక్కలు
- రెండు రోజుల్లో వందశాతం పూర్తి
- డీఎంహెచ్‌వో డాక్టర్ కాశీనాథ్

సిద్దిపేట టౌన్, మార్చి 3 : జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా తొలిరోజు 92.8శాతం మంది చిన్నారులకు చుక్కలను వేసినట్లు డీహెచ్‌వో డాక్టర్ కాశీనాథ్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులను 93,667 మంది ఉన్నట్లుగా గుర్తించినట్లు తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమం 3, 4, 5 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించున్నామని చెప్పారు. దీనిలో భాగంగా తొలిరోజు 86,245 మంది చిన్నారులకు వైద్య శాఖ సిబ్బంది పల్స్ పోలియో చుక్కలను వేసినట్లు ఆయన వివరించారు. ఈ నెల 4, 5న వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి, పోలియో చుక్కలు వేయించని చిన్నారులను గుర్తించి అక్కడే పోలియో చుక్కలు వేస్తారన్నారు. రెండు రోజుల్లో వందశాతం పూర్తిచేస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ సదవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ కూతురు త్రిష వివాహ విందు వేడుక చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ శివారులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, జుక్కల్, నారాయణఖేడ్ ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతరావు, పట్లోళ్ల సంజీవరెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

-పుల్కల్



ముదురుతున్న ఎండలు

ఉమ్మడి జిల్లాలో పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు

మెదక్ అర్బన్, మార్చి 3: ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎండలు ముదురుతున్నాయి. రెండు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ఉక్కపోత మొదలైంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లోని హెచ్చుతగ్గుల ప్రభావంతో జనం ఇక్కట్లు పడుతున్నారు.

ఉష్ణోగ్రతలు ఇలా..

ఉమ్మడి మెదక్ జిల్లాలో అత్యధికంగా సంగారెడ్డి జిల్లా కల్హేర్‌లో 38.7 డిగ్రీలు, సదాశివపేటలో 38.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది. సిద్దిపేట జిల్లా లకుడారంలో 38.5డిగ్రీలు, తుక్కాపూర్‌లో 38.3 డిగ్రీలు, సిద్దిపేటలో 38.2, దౌల్తాబాద్‌లో 38 డిగ్రీలు, మెదక్ జిల్లా కౌడిపల్లిలో 37.7 డిగ్రీలు, శివ్వంపేటలో 37.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మార్చి మొదటి వారంలోనే ఎండలు మండుతుంటే.. ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశాలు లేకపోలేదని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

భిన్నమైన వాతావరణం.. ఇన్‌ఫెక్షన్ల బారిన జనం

ఉమ్మడి జిల్లాలో వారం రోజులుగా పరస్పర భిన్నమైన వాతావరణం నెలకొన్నది. పగలంతా ఉక్కపోత వేధిస్తే.. రాత్రి చల్లటి గాలులు వీస్తున్నాయి. ఈ అసమతుల్య వాతావరణం వైరల్ ఇన్‌ఫెక్షన్లు వ్యాపించేందుకు కారణమవుతున్నది. ఏ ఇంట్లో చూసినా పిల్లలు, పెద్దలు జలుబు, దగ్గు, జ్వరం, తల, గొంతునొప్పి, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారు.



బెజ్జంకి, కోహెడ మండలాల సరిహద్దులో నిర్మించిన కాలువ



మా గతేంటి?

రెంటికీ చెడ్డ రేవడిలా తోటపల్లి రిజర్వాయర్ నిర్వాసిత రైతుల దుస్థితి

- ప్రాజెక్టు రద్దయి పదేళ్లు
- ప్రభుత్వ ఆధీనంలోనే 1,500 ఎకరాలు
- తిరిగివ్వాలని రైతుల వేడుకోలు
- కాంగ్రెస్ సర్కారుపై ఆశలు

బెజ్జంకి, మార్చి 3 : హుస్నాబాద్ నియోజకవర్గానికి సాగునీరు అందించేందుకు తలపెట్టిన తోటపల్లి ప్రాజెక్టు కోసం సేకరించిన భూములపై పదేళ్లయినా సందిగ్ధం వీడడం లేదు. ప్రాజెక్టు రద్దవడంతో భూములను త్యాగం చేసిన రైతుల పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారింది. జీవనాధారమైన భూములను కోల్పోయిన రైతులు మనోవేదనకు గురవుతున్నారు. కాంగ్రెస్ సర్కారైనా తమకు తిరిగివ్వాలని వేడుకుంటున్నారు.

బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టు రద్దు

2007 సెప్టెంబరులో తోటపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. 49,000 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 0.959 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించాలని ప్రతిపాదించింది. ఇందుకోసం 2012 వరకు పలు దఫాలుగా ప్రభుత్వం భూమిని సేకరించింది. అప్పటి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని బెజ్జంకి మండలంలోని గాగిల్లాపూర్, తోటపల్లి, కోహెడ మండలంలోని రామచంద్రాపూర్, వరికోల్, నారాయణపూర్, చిగురుమామిడి మండలంలోని ఓగులాపూర్ గ్రామాల్లో 500మంది రైతులకు చెందిన సుమారు 1,600 ఎకరాల పైచిలుకు భూములను సేకరించారు. రైతులకు ఎకరాకు రూ.2.10 లక్షల పరిహారం చెల్లించి రిజర్వాయర్ పనులను ప్రారంభించారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల రీ డిజైనింగ్‌లో భాగంగా తోటపల్లి రిజర్వాయర్‌ను రద్దు చేసింది. తోటపల్లి చెరువును మాత్రం ఆన్‌లైన్ రిజర్వాయర్‌గా మార్చి గౌరవెల్లి ప్రాజెక్టుకు మిడ్‌మానేరు నుంచి వచ్చే నీటిని తరలించడానికి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వాడుకోవాలని నిర్ణయించింది. బెజ్జంకి, కోహెడ మండలాల సరిహద్దుల్లో ఉన్న మోయతుమ్మెద వాగుపై గౌరవెల్లి ప్రాజెక్టుకు నీటిని తరలించేందుకు గ్రావిటీ కెనాల్‌ను నిర్మించి గౌరవెల్లి ప్రాజెక్టు కాలువకు కలిపారు. ఇందుకోసం రైతుల నుంచి సేకరించిన భూముల్లో 100 ఎకరాలను వాడుకున్నారు. ఇంకా 1500 ఎకరాలు మిగిలి ఉంది. దీనిని ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధర చెల్లిస్తే రైతులకు తిరిగి ఇస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. అనంతరం జిల్లాల పునర్విభజనలో భాగంగా బెజ్జంకి, కోహెడ మండలాలు సిద్దిపేట జిల్లాలో కలవగా చిగురుమామిడి మండలంలోని ఓగులాపూర్ గ్రామం కరీంనగర్ జిల్లాలోనే కొనసాగుతుంది.

భూముల కోసం రైతుల పోరాటం

తోటపల్లి రిజర్వాయర్ కోసం సేకరించిన భూములను తిరిగి రైతులు పొందడానికి మార్కెట్ ధర చెల్లించాలని గత ప్రభుత్వ నిర్ణయంతో వ్యతిరేకత వ్యక్తమైంది. దీనిపై పలువురు రైతులు హైకోర్టును ఆశ్రయించగా స్పందించిన కోర్టు రూ.9.25 లక్షలు చెల్లించాలని సూచించింది. ఈ మొత్తం చెల్లించిన రైతులకు వెంటనే భూములు తిరిగివ్వాలని ఆదేశాలు జారీ చేసింది. కోర్టుకు వెళ్లకుండా ఉన్న మిగతా రైతులు మాత్రం ప్రభుత్వం తమ భూమిని ఎప్పటికైనా తిరిగి ఇస్తుందని ఎదురుచూస్తున్నారు. అయితే బెజ్జంకి మండలంలో గాగిల్లాపూర్ శివారులోని ఒక ప్రైవేట్ సీడ్ కంపెనీకి మాత్రం భూములిచ్చారు. రైతుల కోసం కోర్టు జారీ చేసిన ఆదేశాలనుసారంగా 124 ఎకరాలను 2021లో హుస్నాబాద్ ఆర్డీవో ఆ కంపెనీకి రిజిస్ట్రేషన్ చేశారు. ఇదే సమయంలో డబ్బు చెల్లించేందుకు సిద్ధమైనా, రైతులకు మాత్రం మొండిచేయి చూపారు.

ఎమ్మెల్యే హామీ నిలబెట్టుకునేనా?

మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అసెంబ్లీ ఎన్నికల వేళ బెజ్జంకి మండలం గాగిల్లాపూర్‌లో నిర్వహించిన ప్రచారంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తోటపల్లి ప్రాజెక్టు భూములను తిరిగి అప్పగిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ భూములు తమకే వస్తాయని, ఎమ్మెల్యే న్యాయం చేస్తారని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



తోటపల్లి ప్రాజెక్టు నిర్మిస్తున్నామని అధికారులు మా రెండు ఎకరాల తీసుకొని నామమాత్రం పైసలు ఇచ్చారు. ప్రాజెక్టును నిర్మించలేరు. పది సంవత్సరాలుగా రైతుబంధు పైసలు పడతలేవు. నిరుపేద రైతులం మాకు న్యాయం చేయండి.

\- బొలుమల్ల కనకయ్య, గాగిల్లాపూర్



తోటపల్లి ప్రాజెక్టు కోసమని మాకు జీవనాధారమైన రెండెకరాల భూమిని సేకరించారు. ప్రాజెక్టు రద్దయిన మా భూమి ప్రభుత్వం ఆధీనంలోనే ఉండడంతో మా నాన్న చనిపోయిన కానీ రైతు బీమా రాలేదు.

\- బద్దం అరవింద్‌రెడ్డి, గాగిల్లాపూర్

శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన 'కాశీనాథ్'



ముస్తాబైన కాశీనాథ్ ఆలయం
ఆలయంలో కాశీవిశ్వేశ్వరుడు

నారాయణఖేడ్, మార్చి 3: పట్టణంలోని చారిత్రాత్మకమైన కాశీనాథ్ ఆలయాన్ని శివరాత్రి ఉత్సవాల కోసం ముస్తాబు చేశారు. పట్టణంలోని ఈ ఆలయాన్ని దాదాపు 300 ఏళ్ల క్రితం నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. సికింద్రాబాద్‌కు చెందిన భక్తుడు పట్నం పవన్‌కుమార్‌గౌడ్ ఈ ఆలయం ప్రాముఖ్యతను గుర్తించి జీర్ణోద్ధరణకు కృషి చేశాడు. ఆలయాన్ని ఆధునీకరించడమే కాకుండా, 16 ఏళ్ల క్రితం కాశీవిశ్వేశ్వరుడి విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు. నాటి నుంచి ఈ ఆలయంలో ప్రతి రోజూ ధూపదీప నైవేద్యాలు నిర్వహించడమే కాకుండా, శివరాత్రి పర్వదినం రోజున రుద్రహోమం, రుద్రాభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు కొనసాగడంతో భక్తుల ఆదరణ పెరిగింది. ఏటా శివరాత్రి సందర్భంగా ఆలయంలో శివభక్తులు మాలధారణతో పాటు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 7న ఉదయం 6 గంటల నుంచి ఉత్సవ సంకల్పం, గణపతిపూజ, రుద్రాభిషేకం, భేరి పూజా, అఖండ దీప స్థాపనం, రక్షాబంధనం, మంత్ర పుష్పం, సాయంత్రం 5 గంటలకు పురవీధుల్లో పల్లకీ సేవ, కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 8న ఉదయం 5.30 నుంచి 10 గంటల వరకు సామూహిక గణపతి పూజ, రుద్రాభిషేకాలు, అనంతరం ధర్మదర్శనాలు ఉంటాయి. సాయంత్రం 6 గంటల నుంచి నంది వాహన సేవ, రుద్రాభిషేకాలు, రాత్రి 12.15 గంటలకు మహాహారతి, మంత్రపుష్ప తీర్థప్రసాద వితరణ, కార్యక్రమాలు ఉంటాయి. 9వ తేదీన ఉదయం 9 గంటలకు గణపతిపూజ, శివపార్వతుల కల్యాణం, 11.30 గంటలకు హారతి, కార్యక్రమాలు ఉంటాయని, కల్యాణంలో పాల్గొనే భక్తులు ముందుగాపేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ కమిటీ ఛైర్మన్ బొగి హన్మాండ్లు గుప్తా, దేవాదాయశాఖ ఈవో మోహన్‌రెడ్డి కోరారు.

'కుంట కాలువ కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకోవాలి'

శివ్వంపేట,మార్చి 3: కుంట కాలువను పూడ్చి, కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని శభాష్‌పల్లి రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం పలువురు శభాష్‌పల్లి రైతులు మాట్లాడుతూ.. గ్రామంలోని హంసాన్‌కుంటకు వర్షపు నీళ్లు వచ్చే కాలువను పూడ్చి, అనుమతులు లేకుండా ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే ఆక్రమణను అడ్డుకుని కాలువను కాపాడాలని రైతులు అధికారులను కోరారు.

నెలలు నిండకముందే జననాలు

- వాతావరణ మార్పుల దుష్ప్రభావం
- బాల్యం నుంచే జబ్బుల బారిన భావితరం
- పెరిగిపోతున్న శ్వాసకోశ సమస్యలు
- మందగిస్తున్న ఎదుగుదల.. తాజా అధ్యయనంలో వెల్లడి



హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఏటేటా భూతాపం పెరుగుతోంది. అధిక ఉష్ణోగ్రతలతో వాతావరణంలో ప్రతికూల మార్పులు వేగంగా చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్పుల ప్రభావం పుట్టబోయే పిల్లలపై కూడా ఉంటుందని ఒక అధ్యయనంలో తాజాగా వెల్లడైంది. వాతావరణ మార్పుల వల్ల మున్ముందు ప్రపంచవ్యాప్తంగా 60 శాతం జననాలు నెలలు నిండకముందే సంభవించే ప్రమాదం ఉందని ఆ స్టడీ హెచ్చరించింది. పుట్టిన పిల్లల్లో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపింది. యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియాకు చెందిన పరిశోధకుల బృందం ఈ అధ్యయనం జరిపింది. దీంట్లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా జరిగిన 163 పరిశోధనలను విశ్లేషించారు. తద్వారా, చిన్నారుల ఆరోగ్యంపై వాతావరణ మార్పుల ప్రభావం ఏవిధంగా ఉంటుందనే దానిపై అందుబాటులో ఉన్న శాస్త్రీయ సమాచారాన్ని సమగ్రంగా అధ్యయనం చేశారు. ప్రత్యేకించి ఎటువంటి తీవ్ర వాతావరణ మార్పుల వల్ల భావితరాల ఆరోగ్యంపై ఏ రకమైన ప్రభావం ఉంటుందన్నది పరిశీలించారు. పరిశోధనకు నేతృత్వం వహించిన కోరే బ్రాడ్‌షా తాము గుర్తించిన అంశాలను వెల్లడిస్తూ.. 'పిల్లల ఆరోగ్యంపై వాతావరణ మార్పుల ప్రభావం గణనీయంగా ఉంటోందని గుర్తించాం. తీవ్రమైన చలివాతావరణం వల్ల చిన్నారుల్లో శ్వాససంబంధిత సమస్యలు ఎక్కువగా తలెత్తుతున్నాయి. కరువు, అధిక వర్షాలు వంటివి చిన్నారుల్లో ఎదుగుదలపై ప్రభావం చూపుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల వల్ల ఆస్ట్రేలియాలోని తూర్పు, ఉత్తర ప్రాంతాల్లో నెలలు నిండకముందే పుట్టే పిల్లల సంఖ్య పెరిగినట్లు గుర్తించాం. పశ్చిమ ఆస్ట్రేలియా, క్వీన్స్‌ల్యాండ్‌లలో పిల్లల్లో శ్వాససంబంధిత సమస్యలు అధికమవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల వల్ల దక్షిణాఫ్రికాలో చిన్నారుల మరణాల సంఖ్య కూడా పెరుగుతోంది' అని తెలిపారు. పిల్లలపై వాతావరణ మార్పుల ప్రభావం పేద, సంపన్న దేశాలనే తేడాలనే లేకుండా అన్ని చోట్లా కనిపిస్తోందన్నారు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే మరిన్ని దుష్ప్రభావాలు ఉంటాయని, అవొక సామాజిక, ఆర్థిక సమస్యలుగా మారుతుందని హెచ్చరించారు. భవిష్యత్ తరాలు బాల్యంలోనే జబ్బుల బారినపడటంతో ఆయా దేశాలపై ఆర్థికభారం పెరుగుతుందని, కుటుంబాలపై, ఆరోగ్య సేవలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుందని పేర్కొన్నారు. దీనిని ఎదుర్కొనేందుకు ప్రజారోగ్య అభివృద్ధి విధానాలపై దృష్టిసారించాలని, మానవ చర్యలతో సంభవిస్తున్న వాతావరణ మార్పులను తగ్గించే విధానాలను అమలు చేయాలని ఈ అధ్యయనం ప్రపంచ దేశాలకు సూచించింది. ఈ స్టడీ వివరాలను 'సైన్స్' జర్నల్ ప్రచురించింది.

ఏపీలో జగన్‌కు భారీ ఓటమే!

ఆంధ్రలో టీడీపీ గెలుపు ఖాయం.. ప్రశాంత్ కిశోర్ జోస్యం

- ప్రజలు అభివృద్ధి కోరతారు..
- యువత ఉద్యోగాలు అడుగుతారు
- ఇతరత్రా ప్రయోజనాలు ఆశించరు
- భవంతిలో బటన్ నొక్కితే ఓట్లు రాలవు
- జగన్‌కూ కేసీఆర్ గతే: ప్రశాంత్ కిశోర్

అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భారీ పరాజయం ఎదుర్కోనున్నారని రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) జోస్యం చెప్పారు. ఆయన రాజకీయ భవిష్యత్ క్షీణ దశలో ఉందని, తెలంగాణలో కేసీఆర్‌కు పట్టిన గతే ఆయనకూ పట్టబోతోందన్నారు. తెలుగుదేశం పార్టీ విజయం ఖాయమని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓట్లు వేసేటప్పుడు ప్రజలు అభివృద్ధికే ప్రాధాన్యమిస్తారని.. ఉచిత పథకాలకు కాదని స్పష్టం చేశారు. 'యువత.. ముఖ్యంగా విద్యావంతులు ఉద్యోగాలు కోరుకుంటారు.. ఇతరత్రా ప్రయోజనాలు కాదు. ఉచితాలపైనే జగన్ పూర్తిగా ఆధారపడ్డారు. దీనివల్ల ఆయన గడ్డు పరిస్థితులను ఎదుర్కోబోతున్నారు. మామూలు ఓటమి కాదు.. భారీ పరాజయం తప్పదు' అని తేల్చిచెప్పారు. ప్రజలు సమర్థ నిర్వహణను చూస్తారని.. కేవలం వనరుల నిర్వహణను కాదని చెప్పారు. ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ వారి బాగోగులను చూస్తున్నామని భావిస్తే అది పొరపాటని. జగన్ ఇదే చేస్తున్నారని.. తెలంగాణలో కూడా కేసీఆర్ ఇదేచేసి దెబ్బతిన్నారని తెలిపారు.



ఎన్నికల ఫలితాలను ధనబలం మాత్రమే నిర్ణయించగలదని అనుకుంటే.. ఏ ప్రభుత్వాన్నీ ఓడించలేరని స్పష్టం చేశారు. జగన్ భారీ పరాజయం చవిచూడనున్నారని.. ఎందుకంటే.. భవంతిలో కూర్చుని బటన్ నొక్కి నేరుగా డబ్బును జమచేసినంత మాత్రాన ఓట్లు రాలవని తేల్చిచెప్పారు. ధనమే కీలకమైతే ఏ ప్రభుత్వమూ ఓడిపోదని పునరుద్ఘాటించారు. దక్షిణాదిన రాజకీయాల్లో డబ్బు సంస్కృతి అలవడిందని.. కానీ తీసుకున్న డబ్బు ఆధారంగా ప్రజలు ఓట్లు వేయరని తెలిపారు. 'ఎందుకంటే ఉత్తర భారతంలో కంటే దక్షిణాదినే జనం ఎక్కువ ప్రభుత్వాలను మార్చేశారు' అని చెప్పారు. ఏతావాతా వచ్చే ఎన్నికల్లో ఏపీలో టీడీపీ విజయం తథ్యమని ఆయన అంచనా వేశారు. గత ఎన్నికల్లో ప్రశాంత్ కిశోర్ వైసీపీకి వ్యూహకర్తగా ఉండి ఆ పార్టీని విజయతీరాలకు చేర్చిన సంగతి తెలిసిందే. రెండేళ్ల కిందట ఇక ఎవరికీ రాజకీయ వ్యూహకర్తగా పనిచేయనని ప్రకటించి.. బిహార్ రాజకీయాల్లో మార్పు కోసం 'జన్‌సురాజ్' పేరిట పాదయాత్ర చేపట్టారు. అయితే ఆయన ఐ-ప్యాక్ టీం ఇప్పటికీ జగన్‌కు పనిచేస్తోంది. ఆ మధ్య పీకే టీడీపీ అధినేత చంద్రబాబుతో కూడా సమావేశమయ్యారు. ఆ పార్టీ తరఫున పనిచేయబోతున్నారని వార్తలు వచ్చినా ఉభయవర్గాలూ వాటిని తోసిపుచ్చాయి.

కదిలిన యంత్రాంగం

(మొదటి పేజీ తరువాయి)

తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ బృందం ఈ భూములను పరిశీలించి సర్వే నిర్వహించారు. డ్రోన్ సర్వే ద్వారా నిర్మాణాలు, భూముల సరిహద్దులు, ఎవరెవరు ఇక్కడ భూములు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు? ఎంత భాగం ఇందులో భూదాన భూములున్నాయి? వంటి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ సర్వే నంబర్లపై విచారణ జరుపుతున్నామని, అన్ని అంశాలతో కూడిన సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా.. ఈ భూముల్లో పాగా వేసిన మరికొంత మంది పెద్దల పేర్లు కూడా వెలుగులోకి వస్తున్నాయి. ధరణి వచ్చిన తరువాత పెద్దలంతా అధికార అండతో ఈ భూములను సొంతం చేసుకున్నట్లు వెల్లడవుతోంది. 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో.. భూదాన్ భూములను కొనుగోలు చేసిన వారంతా లోలోన ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా భూదాన భూముల వ్యవహారంలో సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. దీనిపై లోతైన విచారణ జరపాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదిక పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారులు సోమవారం ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వట్టినాగుపల్లిలో భూమికి సంబంధించి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇచ్చిన వివరణకు, రికార్డుల్లో ఉన్న వివరాలకు పొంతన కుదరడం లేదు. తాను 2014లో భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెబుతున్నా.. రెవెన్యూ రికార్డుల్లో 2021 వరకు ఎందుకు నమోదు కాలేదనే విషయానికి మాత్రం సమాధానం లేదు. రాజేశ్వర్‌రెడ్డితో పాటు అనేక మంది భూముల వివరాలు కూడా రెవెన్యూ రికార్డుల్లో ఎక్కడా నమోదు కాలేదు. ధరణి పోర్టల్ వచ్చిన తరువాతే వీరందరికీ పాస్‌బుక్‌లు జారీ అయ్యాయి. విచిత్రమేమిటంటే.. 2021 జూన్ 10వ తేదీన అప్పటి కలెక్టర్ ఈ 29.27 ఎకరాల భూదాన భూములను 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టగా, అదే ఏడాది ఆగస్టు 24వ తేదీన పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సర్వే నంబరు 188/1/2 పేరుతో పట్టాదారు పాస్‌బుక్ జారీ అయింది. ఆయనతోపాటు మిగతా వారికి పాస్‌బుక్ జారీ చేయడం వెనుక పెద్ద తతంగమే నడిపారు. ఏడీ సర్వే ల్యాండ్ రికార్డు స్కెచ్, భూదాన బోర్డు స్కెచ్ కూడా చూపించి ధరణి ద్వారా పాస్‌బుక్‌లు జారీ చేశారు. సాధారణంగా ఇలాంటి విషయాల్లో స్థానిక తహసీల్దార్, మండల సర్వే అధికారుల నివేదిక తీసుకుంటారు. కానీ, ఇక్కడ నేరుగా ఏడీ ల్యాండ్ రికార్డ్స్ ఇచ్చిన స్కెచ్, భూదాన బోర్డు ఇచ్చిన స్కెచ్ ఆధారంగా పాస్‌బుక్‌లు ఇచ్చినట్లు చెబుతున్నారు. అయితే అప్పటి వరకు అసలు సబ్‌డివిజన్, ఎంజాయ్‌మెంట్ సర్వే జరిగినట్లు ఆధారాలు కూడా లేకపోవడం వల్లే రెవెన్యూ అధికారులు పాస్‌బుక్‌లు నిలిపివేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ 22ఏ జాబితాలో కూడా స్పష్టంగా పేర్కొన్నారు. పైగా.. వీరు చూపిస్తున్న భూదాన బోర్డు స్కెచ్‌లో ఎక్కడా సంతకం గానీ, తేదీ గానీ, కనీసం స్టాంప్ గానీ లేకపోవడం గమనార్హం. ధరణి ముసుగులో జరిగిన ఈ బాగోతాలు ఒకటి రెండు రోజుల్లో అధికారికంగానే బట్టబయలయ్యే అవకాశం ఉంది.

నేను కొన్నది భూదాన భూమి కాదు: పల్లా

వట్టినాగులపల్లి భూదాన భూముల వ్యవహారంలో తనపై వస్తున్న ఆరోపణలు నిజం కాదని, వాటిని ఖండిస్తున్నానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తనకు అక్కడ ఉన్నది కేవలం 1.10 ఎకరాలు మాత్రమేనని, ఇది కూడా భూదాన భూమి కాదని చెప్పారు. తాను వట్టినాగులపల్లి సర్వే నంబరు 181/1/2లో భూమి కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నానని, దీనిపై న్యాయసలహాలు కూడా తీసుకుని 2014లో రిజిస్ట్రేషన్ చేసుకున్నానని పేర్కొన్నారు. ఈ వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో కూడా పొందుపరిచానని తెలిపారు. ఈ భూమికి సంబంధించిన వివరాలన్నీ తన వద్ద ఉన్నాయని, ఏడీ సర్వే ల్యాండ్ రికార్డు స్కెచ్, భూదాన బోర్డు స్కెచ్ కూడా ఉన్నాయని చెప్పారు. వీటిని ఎవరైనా పరిశీలించుకోవచ్చన్నారు.


మత్తుమందు ఇచ్చి యువతిపై ఇద్దరి అత్యాచారం

- నగ్నచిత్రాలు ఉన్నాయంటూ వేధింపులు
- పోలీసులకు ఫిర్యాదుతో వెలుగులోకి ఘటన

బోరబండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఓ యువతికి మత్తు మందు ఇచ్చి ఇద్దరు యువకులు అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తమ వద్ద నగ్న చిత్రాలు ఉన్నాయంటూ.. చెప్పినట్లు వినకపోతే వాటిని బయటపెడతామంటూ ఆ ఇద్దరూ యువతిపై వేధింపులకు దిగారు. ఈక్రమంలోనే ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఏడాది క్రితం జరిగిన ఈ ఘటనకు సంబంధించి హైదరాబాద్ బోరబండ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరగడంతో కేసును అక్కడికే బదిలీ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఎల్బీనగర్ పరిధిలో తల్లిదండ్రులతో కలిసి ఉంటూ డిగ్రీ చదివే యువతికి ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రణవ్ అనే యువకుడు పరిచయమయ్యాడు. దీంతో అతడు యువతి కళాశాల దగ్గర వెళ్లి కలిసేవాడు. గతేడాది యువతి కళాశాల వద్దకు వెళ్లిన ప్రణవ్ ఆమెను ఇంటి వద్ద డ్రాప్ చేస్తానని బైక్‌పై తీసుకెళ్లాడు. అయితే ఆమెను ఇంటికి తీసుకెళ్లకుండా హోటల్‌కు తీసుకెళ్లి.. తాగునీటిలో మత్తుమందు కలిపిచ్చి స్పృహ కోల్పోయేలా చేశాడు. ఆ తర్వాత మరో యువకుడితో కలిసి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో భయపడిన యువతి విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. అయితే 2 నెలల క్రితం యువతి కుటుంబం బోరబండకు మకాం మార్చారు. ఈ నేపథ్యంలోనే యువతికి ఆ ఇద్దరు మళ్లీ ఫోన్ చేశారు. తాము చెప్పినట్లు వినాలని.. లేదంటే నగ్నచిత్రాలు బయటపెడతామంటూ వేధింపులకు దిగారు. దీంతో ఆ యువతి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పి.. వారితో కలసి బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది.







మమ్మేలు కొమురెల్లి మల్లన్నా

- ఏడోవారం జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులు
- పట్నాలు రచించి, బోనాల నివేదన
- వీవీఐపీ, ఉచిత దర్శన క్యూలైన్లలో బారులు



అర్ధమండపంలో మల్లన్నను దర్శించుకుంటున్న భక్తులు



రాజగోపుర ఆవరణలో భక్తుల సందడి

చేర్యాల, మార్చి 3: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో వారాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. జయహో...కొమురవెల్లి మల్లన్నా... మమ్మేలు మాయన్నా... జయహో... అంటూ జయజయధ్వానాలు చేసి భక్తులు భక్తితన్మయత్వం చెందారు. తలనీ లాలు సమర్పించి కోనేరులో పుణ్యస్నానమాచరించారు. బోనం నివేదించి బెల్లం పాయసం నైవేద్యం పెట్టి బస చేసిన ప్రదేశం, గంగిరేగుచెట్టు ప్రాంగణం, ముఖమండపాలలో చెలక, నజరు, ముఖ మండప పట్నాలు రచించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్లమ్మతల్లికి కల్లు, బెల్లంపానకం శాకపెట్టి బోనం నివేదించారు. తమను చల్లగా కాపాడుమని వేడుకున్నారు. తమ కోరికలు ఈడేర్చమని వేడుకుంటూ గంగిరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో వీవీఐపీ, ప్రత్యేక ఉచిత దర్శన క్యూలైన్లలో బారులుతీరారు. స్వామివారి దర్శనానికి 3 గంటల పాటు సమయం పట్టడంతో ఇబ్బందులుపడ్డారు. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టగా, సీఐ శ్రీను, ఎస్ఐ నాగరాజు బందోబస్తు నిర్వహించారు. పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్వాటకం లక్ష్మారెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా.. ఉదయం నుంచి విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన వెంటనే జనరేటర్‌ను ఆన్ చేయకపోవడంతో చీకట్లోనే భక్తులు దర్శనం చేసుకున్నారు.

మల్లన్న భక్తులకు అందుబాటులో అభిషేకం లడ్డూ

చేర్యాల, మార్చి 3: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ దర్శనార్థం వచ్చిన భక్తులకు అభిషేకం లడ్డూ ప్రసాదం ఎట్టకేలకు అందుబాటులోకి వచ్చింది. రూ.900 చెల్లించి ఆర్జితసేవలు నిర్వహించిన వారితో పాటు రూ.500తో వీవీఐపీ దర్శన టికెట్ తీసుకున్న భక్తులకు ఆదివారం ఆలయవర్గాలు 400 గ్రాముల లడ్డూప్రసాదాన్ని అందించారు. 100 గ్రాముల పరిమాణం లడ్డూ ప్రసాదం కిలో తయారీకి రూ.38, 400 గ్రాముల పరిమాణంగల అభిషేకం లడ్డూ తయారీ కిలోకి ఒక పైసా చొప్పున లేబర్ చార్జీల చెల్లిస్తుండటంతో కాంట్రాక్టర్ అభిషేకం లడ్డూలకు బదులు 100గ్రాముల లడ్డూలు అందిస్తూ అవకతవకలకు పాల్పడుతున్నా ఆలయవర్గాలు పట్టించుకోవడం లేదు. ఈ విషయమై ఇటీవల 'ఆంధ్రజ్యోతిలో' మల్లన్న భక్తులకు అందని లభిషేకం లడ్డూ' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆలయాధికారులు అభిషేకం లడ్డూ ప్రసాదాన్ని తయారు చేయించారు. వీవీఐపీ దర్శనం, ఆర్జితసేవలు నిర్వహించిన భక్తులకు ఉచితంగా అందించడంతో పాటు ప్రసాద కౌంటర్లలో విక్రయానికి చర్యలు తీసుకున్నారు. లడ్డూ ప్రసాద తయారీ లేబర్ చార్జీల చెల్లింపుల్లో కొన్నినెలలుగా కొనసాగుతున్న అవకతవకలపైనా విచారణ చేపట్టాలని భక్తులు కోరారు.



లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా

- పార్టీ మారుతానంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవం
- జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, మార్చి 3: తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని, కాంగ్రెస్‌లో చేరుతానంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత, మంత్రులు తనను అన్నివిధాలుగా ఆదుకున్నారని, అలాంటి పార్టీని వదిలి వేరే పార్టీలో చేరుతానంటు వస్తున్న ప్రచారాలు సరికాదన్నారు. కొందరు పనిగట్టుకుని లేనిపోని ప్రచారాలు చేస్తూ ఇరకాటంలోకి నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, అలాంటి వారికి దూరంగా ఉండాలన్నారు. తానైతే బీఆర్ఎస్‌లోనే కొనసాగుతూ పార్టీ పటిష్టత, జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఎవరో చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదనే విషయాన్ని అందరూ గ్రహించాలన్నారు. ప్రచారం చేసేవారు ముందుకు వచ్చి తనను ప్రశ్నిస్తే సమాధానం ఇస్తానని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత హయాంలో జహీరాబాద్ ప్రాంతం అన్నిరంగాల్లో ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. కాలం గడిచే కొద్దీ, జనాభా పెరుగుతున్న కొద్దీ సమస్యలు పెరుగుతుంటాయని, ప్రజల సహకారంతో వాటన్నింటిని అంచలంచెలుగా పరిష్కరించుకుందామని చెప్పారు. జహీరాబాద్ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.



క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

చిన్నారి కిడ్నాప్ కథ సుఖాంతం

- కిడ్నాపర్‌ను అరెస్టు చేసి పాపను రక్షించిన పోలీసులు



కిడ్నాప్‌కు గురైన పాపను కుటుంబీకులకు అప్పగించిన పోలీసులు

జహీరాబాద్, మార్చి 3: హైదరాబాద్‌లోని మాదన్నపేట పరిధిలో నుస్రత్‌షాజాహాన్‌బేగం అనే మహిళ 8 నెలల చిన్నారిని కిడ్నాప్‌చేసి శనివారం రాత్రి మహారాష్ట్రకు తరలిస్తున్న క్రమంలో జహీరాబాద్‌లో పట్టుకున్నామని పట్టణ ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని మాదన్నపేట ప్రాంతానికి చెందిన అమర్యాసిద్దిఖ్(8 నెలలు)ను నుస్రత్‌షాజాహాన్‌బేగం అనే మహిళ హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు కర్ణాటక బస్సులో తీసుకుపోతున్నది. ఈ విషయాన్ని అక్కడి పోలీసులు తమకు సమాచారం ఇవ్వడంతో కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు చెందిన బస్సులను తనిఖీలు చేయగా నుస్రత్‌షాజాహాన్‌బేగం పాపతో కలిసి పట్టుబడిందన్నారు. ఈ మేరకు ఆమెను అదుపులోకి తీసుకుని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు, మాదన్నపేట పోలీసులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. వెంటనే వారు పాప తల్లిదండ్రులతో వచ్చారని ఆయన చెప్పారు. ఈ మేరకు పాపను, నేరస్థురాలిని మాదన్నపేట పోలీసులకు అప్పగించామని ఎస్ఐ తెలిపారు.

హోటల్‌లోకి దూసుకెళ్లిన బైక్, ఇద్దరికి గాయాలు

టేక్మాల్, మార్చి 3: హోటల్‌లోకి బైక్ దూసుకెళ్లి ఇద్దరికి స్వల్ప గాయాలైన సంఘటన మండల కేంద్రమైన టేక్మాల్ చౌరస్తా వద్ద ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకున్నది. పాపన్నపేట మండలం నార్సింగి గ్రామానికి చెందిన ఇరువురు నార్సింగి నుంచి బోడ్మట్‌పల్లి వైపు బైక్‌పై అతివేగంగా వెళ్తూ టేక్మాల్ చౌరస్తా పక్కన ఉన్న హోటల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. హోటల్‌లోని టేబుల్స్ ధ్వంసమయ్యాయి. ఈ ఘటనతో అక్కడున్న వారు భయాందోళనకు గురయ్యారు.

తూప్రాన్‌లో 50 వాహనాలు సీజ్

తూప్రాన్, మార్చి 3: తూప్రాన్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదివారం ఎస్ఐ శివానందం వాహన తనిఖీలు చేపట్టారు. నంబర్లు ప్లేట్లు లేని వాహనాలు, సరైన పత్రాలు లేకుండా ఉపయోగిస్తున్న 50 వాహనాలు సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని తెలిపారు. నంబరు ప్లేట్లు, సరైన పత్రాలు, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపొద్దని సూచించారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ లక్ష్మి, జానీభాష పాల్గొన్నారు.

బీసీ గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతం



సంగారెడ్డిలోని బీసీ గురుకుల పాఠశాల వద్ద పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 3: ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా మహాత్మా జ్యోతిబాపూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 6,7,8వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. సంగారెడ్డి జిల్లాలో 14 కేంద్రాల్లో 3,391 మందికి 3,079 మంది హాజరుకాగా, 312 మంది గైర్హాజరయ్యారు. మెదక్ జిల్లాలో 10 కేంద్రాల్లో 2,326 మందికి 2,127 మంది హాజరుకాగా, 199 మంది గైర్హాజరయ్యారు. సిద్దిపేట జిల్లాలో ఆరు కేంద్రాల్లో 1,480 మందికి 1,303 మంది హాజరుకాగా, 177 మంది గైర్హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 30 కేంద్రాల్లో 7,197 మందికి 6,509 మంది హాజరుకాగా, 688 మంది గైర్హారయ్యారు. సంగారెడ్డిలోని బీసీ బాలికల గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రాన్ని రీజినల్ కో ఆర్డినేటర్ ప్రభాకర్ తనిఖీ చేశారు.

వైభవంగా బోనాలు

మెదక్ అర్బన్, మార్చి3: రేణుకా ఎల్లమ్మ 30వ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో గ్రామ దేవతలైన నల్లపోచమ్మ, ముత్యాలమ్మ, గట్టమ్మ, బోరంచమ్మ అమ్మవార్లకు ఘనంగా బోనాలు తీశారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో ఉన్న మహిళలు డప్పుచప్పుళ్లు, యువకుల నృత్యాల నడుమ వైభవంగా బోనాలు ఊరేగింపు నిర్వహించారు. మంగళవారం రేణుకాఎల్లమ్మ తల్లికి బోనాల ఊరేగింపు, ఒడిబియ్యం సమర్పణ, కల్యాణంతో పాటు ప్రత్యేక పూజలు జరగనున్నట్లు గౌడ సంఘం అధ్యక్షుడు గడ్డమీది కృష్ణాగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు గడ్డమీది యశోద, ఆరెళ్ల గాయత్రి, దొంతి లక్ష్మి, లక్ష్మీనారాయణగౌడ్, మమత, ఆలయ కమిటీ చైర్మన్ సురేందర్‌గౌడ్, సంఘ సభ్యులు నారాగౌడ్, మంగశ్రావణ్‌గౌడ్, శంకర్‌గౌడ్, కృష్ణగౌడ్, శరత్‌గౌడ్, రాజాగౌడ్, సంతోష్‌గౌడ్, అరవింద్‌గౌడ్, మోహన్‌గౌడ్, నాగభూషణంగౌడ్ పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజం కోసం కృషిచేద్దాం

వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లాల్లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. 0-5 సంవత్సరాలోపు పిల్లలకు పోలియో చుక్కల మందును వేశారు. నేడు, రేపు ఇంటింటికీ తిరిగి చుక్కల మందు వేయనున్నారు. పోలియో రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని కోరారు.

గజ్వేల్, మార్చి 3: గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళితో కలసి పల్స్ పోలీయో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గజ్వేల్ జడ్పీటీసీ పంగ మల్లేశం, వైద్యాధికారులు రాహుల్, బల్బీర్‌సింగ్, తదితరులున్నారు.

● **చిన్నకోడూరు/సిద్దిపేట టౌన్:** చిన్నకోడూరు పీహెచ్‌సీలో జడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డితో కలిసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ఉమేష్ చంద్ర, ఎంపీటీసీ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో మల్లీశ్వరి, పీహెచ్‌సీ వైద్యురాలు సరిత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని చెర్లఅంకిరెడ్డిపల్లి గ్రామంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్జు యాదవ్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నాయకుడు శ్రీనివాస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సిద్దిపేట పట్టణంలోని నాసర్‌పురా పాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని రోజా రాధాకృష్ణ శర్మ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో కాశీనాథ్, మున్సిపల్ చెర్‌పర్సన్ కడవెర్గు మంజులరాజనర్సు, అధికారులు విజయరాణి, శ్రీకాంత్ పాల్గొన్నారు. సిద్దిపేట పట్టణంలోని నెహ్రూ యువ కేంద్రం వద్ద పల్స్ పోలియో కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు గయాసుద్దీన్, రాషద్ పాల్గొన్నారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కమాన్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు బొమ్మల యాదగిరి ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

● **సిద్దిపేటరూరల్:** సిద్దిపేట రూరల్ ఎంపీపీ శ్రీదేవి చందర్‌రావు రాఘవాపూర్ గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

● **చేర్యాల:** పల్స్‌పోలియో కార్యక్రమాన్ని చేర్యాల, కొమురవెల్లి మండలాలలో వైద్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. పట్టణంలో మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, 4వ వార్డులో వైస్‌చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, 2వ వార్డులో కౌన్సిలర్ చెవిటి లింగం, 3వ వార్డులో కౌన్సిలర్ మంగోలు చంటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల గ్రామంలో ఎంపీపీ తలారి కీర్తన చిన్నారులకు పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియోను ప్రారంభించారు.

● **హుస్నాబాద్‌రూరల్ :** హుస్నాబాద్ పట్టణంలోని పల్స్‌పోలియో సెంటర్లను మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు బోజు రమాదేవి, నళినిదేవి, అయిలేని శంకర్‌రెడ్డి, ఎండీ అయూబ్, డీఎంహెచ్‌వో ప్రభాకర్, వైద్యురాలు నిఖిత సాంబయ్య, కనుకయ్య, దినకర్, ఆశావర్కర్లు, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు. హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీపీ లకావత్ మానస పోలియో పల్ పోలీయో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యురాలు నిఖిత, స్పెషల్‌ఆఫీసర్ కవిత, తాజా మాజీ సర్పంచ్ లత, పాల్గొన్నారు.

● **ములుగు:** ములుగు మండలం బస్వాపూర్ గ్రామంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ములుగు జెడ్పీటీసీ నర్సంపల్లి జయమ్మ అర్జున్‌గౌడ్ ప్రారంభించారు. ములుగులో ఎంపీటీసీ హరిబాబు, క్షీరాసాగర్‌లో ఎంపీటీసీ కొన్యాల మమత బాల్‌రెడ్డి, వివిధ గ్రామాలలో ఎంపీటీసీలు పిల్లలకు చుక్కలు వేశారు.

● **వర్గల్:** మండలంలోని అవుసులోనిపల్లిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని వర్గల్ ఎంపీపీ లతా రమేశ్‌గౌడ్, జడ్పీటీసీ బాలు యాదవ్ ప్రారంభించారు.

● **బెజ్జంకి:** మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాయంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎంపీపీ నిర్మల, జడ్పీటీసీ కవిత ప్రారంభించారు.

● **కోహెడ:** కోహెడలో ఎంపీటీసీ ఖమ్మం స్వరూప పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నిమ్రా పాల్గొన్నారు.

● **మద్దూరు:** మండలకేంద్రంలో ఎంపీటీసీ బొప్పె కనకమ్మ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు.


గజ్వేల్ పట్టణంలో పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి


చిన్నకోడూరులో పోలియో చుక్కలు వేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ


అవుసులోనిపల్లిలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ లత, జడ్పీటీసీ బాలు యాదవ్


కోహెడలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీటీసీ స్వరూప, వైద్యాధికారి నిమ్రా


కొమురవెల్లి మండలం మర్రిముచ్చాలలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ


మద్దూరులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీటీసీ కనకమ్మ


బెజ్జంకి మండల కేంద్రంలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ


హుస్నాబాద్‌లో పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత


మీర్జాపూర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ లకావత్ మానస


బస్వాపూర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న జడ్పీటీసీ జయమ్మ అర్జున్‌గౌడ్

చెరువు శిఖంలో అక్రమ బాటపై ఫిర్యాదు

మద్దూరు, మార్చి 3 : మండలంలోని వల్లంపట్ల గ్రామంలోని పడమటి చెరువు శిఖంలో వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు అక్రమంగా దారి ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ, రైతు చెట్కూరి మల్లేశం ఆదివారం మద్దూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఆయన విలేకర్లతో మాట్లాడారు. గ్రామానికి చెందిన మేడిచల్మి సందీప్, బోడపట్ల బాలయ్య, బాషనమైన కుమార్, గూళ్ల కుమార్ తమ వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు పక్క భూమి రైతు ఖరీదుకు బాట ఇస్తానని చెప్పాడు. దీనికి అంగీకరించి డబ్బులు చెల్లించలేక పక్కనే ఉన్న పడమటి చెరువులోంచి రాత్రికి రాత్రే అక్రమంగా బాట ఏర్పాటుకు చేసుకుని మొరం కుప్పలు పోయించారు. వర్షాకాలంలో వరద నీరు వచ్చి చెరువులోకి చేరుతుందని, వరద నీటికి అడ్డంగా బాట ఏర్పాటు చేస్తుండటంతో పొలం ముంపునకు గురవుతుందని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.


శిఖం భూమిలో వేసిన బాట

బస్టాండ్ ముందు పోసిన ఇసుక, కంకరను తొలగించాలి

మద్దూరు, మార్చి 3 : ఇంటి నిర్మాణం పూర్తయినా, ప్రయాణ ప్రాంగణం ముందు రెండేళ్ల క్రితం పోసిన ఇసుక, ఇటుక, కంకర కుప్పలను తొలగించడంలో వ్యక్తి నిర్లక్ష్యం వహిస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవడంలో గ్రామపంచాయతీ విఫలమైయిందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నర్సాయపల్లిలో గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బస్టాండ్ పక్కనే రెండేళ్ల క్రితం ఇంటి నిర్మాణం చేపట్టాడు. నిత్యం ప్రయాణం సాగిస్తున్న విద్యార్థులతో పాటు గ్రామస్థులు బస్టాండ్ ముందు పోసిన ఇసుక, కంకర కుప్పల మూలంగా ప్రయాణ ప్రాంగణంలో కాసేపు కూడా కూర్చోలేని పరిస్థితి ఏర్పడింది. ఆటో, బస్సుల రాక కోసం ఎదురు చూస్తూ, ఎండలోనే నిల్చునే పరిస్థితులు ఏర్పడ్డాయి. వెంటనే ప్రయాణ ప్రాంగణం ముందు పోసిన ఇసుక, కంకర కుప్పలను తొలగించి, ప్రయాణికులకు బస్టాండ్ వినియోగంలోకి తీసుకురావలని గ్రామస్థులు కోరుతున్నారు.



నర్సాయపల్లిలో ప్రయాణ ప్రాంగణం ఎదుట పోసిన ఇసుక, కంకర కుప్పలు

కోహెడలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు

కోహెడ, మార్చి 3: మండల కేంద్రంలో ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా మంచి స్పందన లభించింది. ఈ శిబిరాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు బండ జగన్ యాదవ్, ఎంపీటీసీ ఖమ్మం స్వరూప, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశం ప్రారంభించారు. శిబిరంలో 60 మంది యువకులు రక్తదానం చేశారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఈ శిబిరాన్ని నిర్వహించినట్టు జగన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటస్వామి, గుగ్గిళ్ల శ్రీనివాస్,పెర్యాల సాగర్ రావు, సురేందర్‌రెడ్డి, ఆర్ఎంపీ నాయకులు పిల్లి ప్రభాకర్, పొలు శ్రీనివాస్, వడ్డేపల్లి పరంధాములు, చంద్రమౌళి, శ్రీకాంత్‌చారి, తిరుపతి, సుంచు శ్రీనివాస్, ఆంజనేయులు, శనిగరం రమేష్, రాజు, ముత్యంరెడ్డి, సాగర్, వెంకటరెడ్డి, ఓంకార్, పొన్నాల సురేష్, ప్రసాద్, శ్రీనివాస్, తదితరులున్నారు.

అధికారులు మారినా.. బోర్డుపై పాత పేర్లేనా?



చిన్నకోడూరు, మార్చి 3: చిన్నకోడూరు పోలీసు స్టేషన్‌లో సమాచార హక్కు చట్టం బోర్డుపై ఇంకా పాత అధికారుల పేర్లే దర్శనమిస్తున్నాయి. దీంతో పోలీసు స్టేషన్‌కు వస్తున్నవారు అయోమయానికి గురవుతున్నారు. సిద్దిపేట రూరల్ సీఐ, చిన్నకోడూరు ఎస్ఐ మారి కొత్త వారు వచ్చినా, బోర్డు పై పాత సీఐ, ఎస్ఐ పేర్లే ఉన్నాయి. బోర్డుపై పేర్లు మార్చడంలో కూడా జాప్యమెందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కేజీబీవీ భవన నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో?

● భవన నిర్మాణానికి రూ.3.5 కోట్లు మంజూరు
● రెండేళ్ల క్రితం శంకుస్థాపన
● రాయపోల్‌లో పిల్లర్లకే పరిమితమైన నిర్మాణం

రాయపోల్, మార్చి 3: రాయపోల్‌లో కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. శంకుస్థాపన చేసి రెండేళ్లు పూర్తి కావస్తున్నా, నిర్మాణ పనులు ఇంకా పిల్లర్ల స్థాయిలోనే ఉండిపోయాయి. ఏడేళ్ల క్రితం రాయపోల్‌లో కేజీబీవీ పాఠశాల ప్రారంభం అయింది. అప్పటి నుంచి ఈ పాఠశాలను ఓ ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు సుమారు 200 మంది బాలికలు చదువుకుంటున్నారు. రాయపోల్‌లో కేజీబీవీ భవన నిర్మాణం కోసం సర్వశిక్షా అభియాన్ పథకం కింద రూ. 3.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 2022 ఏప్రిల్ 28న అప్పటి మంత్రి హరీశ్‌రావు, అప్పటి ఎమ్మెల్యే రఘునందన్‌రావు, అప్పటి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి రెండేళ్ళు గడిచినప్పటికీ నిర్మాణ పనులు మాత్రం పిల్లర్ల స్థాయిలోనే ఉన్నాయి. మరో మూడు నెలల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ పాఠశాల వచ్చే విద్యా సంవత్సరంలో అందుబాటులోకి వచ్చేది కూడా అనుమానమే.

కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం

రాయపోల్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలల కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం. వారం రోజుల్లో స్లాబ్ పనులు పూర్తయ్యేలా చూస్తాం. వచ్చే విద్యా సంవత్సరంలో కనీసం గ్రౌండ్‌ఫ్లోర్ అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తే కాంట్రాక్టు రద్దు చేస్తాం.

– షఫీ, ఆర్వీఎంఏఈ


రాయపోల్‌లో పిల్లర్ల వద్దనే నిలిచిపోయిన నిర్మాణ పనులు

చైర్మన్ పదవి ఎవరికి దక్కేనో?

● నేతల చుట్టూ వంటిమామిడి కాంగ్రెస్ ఆశావహుల ప్రదక్షణలు

ములుగు, మార్చి3: ములుగు మండలం వంటిమామిడి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎవరికీ దక్కుతుందోనన్న చర్చ నాయకుల్లో తీవ్రంగా జరుగుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో నామినేటెడ్ పదవులపై నాయకులు ఆశలు పెట్టుకున్నారు. కొందరు నాయకులు తమ ఆకాంక్షను అధిష్ఠానానికి చెప్పుకుంటూ లాబీయింగ్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే మార్కెట్ కమిటీలను ప్రభుత్వం రద్దు చేసింది. మార్కెట్ కమిటీల చైర్మన్ పదవులకు రిజర్వేషన్లు కూడా ప్రభుత్వం ఖరారు చేసి ప్రకటించింది. వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎస్సీ మహిళకు రిజర్వు చేశారు. దీంతో ఆ వర్గానికి చెందిన నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై ఆశలు పెంచుకుని అప్పుడే ప్రయత్నాలు మొదలు పెట్టారు.

ఆశావహులు వీరే..

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వు కావడంతో ములుగు గ్రామానికి చెందిన చింతకింది రాజు తల్లి సుశీలకు చైర్మన్ పదవి దక్కించుకునేలా ప్రయత్నాలు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అండదండలతో తన తల్లి సుశీల కోసం చింతకింద రాజు ప్రయత్నాలు మొదలుపెట్టారు. మామిడ్యాల గ్రామానికి చెంది ఫాక్స్ మాజీ వైస్ చైర్మన్ ఎడ్ల పోచయ్య మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆశీస్సులతో ప్రయత్నాలు చేస్తున్నారు. వర్గల్ మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ మోహన్ తన భార్యకు చైర్మన్ పదవి కోసం మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశీస్సులతో ప్రయత్నాలు చేస్తున్నారు. ములుగు గ్రామానికి చెందిన మాజీ సర్పంచు ఇందిర కూడా ఆ పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.



వంటిమామిడి మార్కెట్

ఆలయాల అభివృద్ధికి కృషి

● డీసీసీ ప్రెసిడెంట్ తూంకుంట నర్సారెడ్డి


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్, మార్చి 3: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ ప్రెసిడెంట్ తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని శ్రీ నల్ల పోచమ్మ, శ్రీరేణుకాఎల్లమ్మ ఆలయాలను ఆయన ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయాల్లో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. నల్లపోచమ్మ ఆవాలయం వద్ద సీసీ రోడ్డు, ప్రహరీ గోడల నిర్మాణానికి కృషిచేస్తానన్నారు. సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఆయనవెంట నాయకులు నాయిని యాదగిరి, శివరాంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సురేశ్, యాదగిరి, పంజాల రాజు, రాజగౌడ్, రమేశ్‌గౌడ్ తదితరులున్నారు.

భగీరథ పైప్‌లైన్ ధ్వంసం

● నిలిచిన తాగునీటి సరఫరా

చేర్యాల, మార్చి 3: ఎన్‌హెచ్, మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం కారణంగా చేర్యాల పట్టణంలో మిషన్ భగీరథ పైపుల ధ్వంసం కొనసాగుతున్నది. రోడ్డువిస్తరణ పనుల కారణంగా ఇటీవల స్థానిక పెట్రోల్‌పంప్ ఏరియాలో పైప్ పగిలిపోగా, ఆదివారం పట్టణ శివారు ఐఓసీ పెట్రోల్‌పంప్ సమీపంలోని కల్వర్టు నిర్మిత ప్రదేశం వద్ద మరో పైపు ధ్వంసమైంది. పనుల కోసం గోతులుతీస్తున్న సిబ్బంది అవగాహన లేమి, సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా సమస్య ఉత్పన్నమవుతున్నది. కొద్దిరోజుల క్రితం ఐఓసీ పెట్రోల్‌పంప్ సమీపంలో పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టడంతో రోజులతరబడి నీటి సరఫరా నిలిపివేశారు. పనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ తాగునీటి ఇక్కట్లు సృష్టిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఈ నెల 6న డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

గజ్వేల్, మార్చి 3: గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 6న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ కవిత తెలిపారు. తెలంగాణ స్కిల్, నాలెడ్జ్ సెంటర్(టీఎస్‌కేసీ), పిరామల్ ఫైనాన్స్ కంపెనీ సమన్వయంతో ఈ జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. 2022-23 సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు, డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులని, ఆసక్తి గల వారు తమ ధ్రువపత్రాలు, ఫొటో, రెస్యూమ్, జిరాక్సు కాపీలతో కళాశాలలో ఈ నెల 6న ఉదయం 10గంటలకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు (9396421849) నెంబర్‌కు సంప్రదించాలన్నారు.



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడుస్తున్నా, వైద్య శాఖ అధికారులకు మాత్రం ఆ ధ్యాసే లేదు. ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ అయిన బాలింతలను ఉచితంగా ఇంటికి చేర్చేందుకు గత ప్రభుత్వం '102' పేరిట అమ్మఒడి వాహనాలను ఏర్పాటు చేసింది. బీఆర్ఎస్ పాలనలో ఆ వాహనాలకు కేసీఆర్ చిత్రాన్ని అతికించారు. ఎన్నికల అనంతరం మాజీ సీఎం కేసీఆర్ చిత్రాన్ని తీసివేసినా, సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోను అక్కడ ఏర్పాటు చేయాల్సి ఉండగా, తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

– ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట జిల్లా

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


కనకయ్య మృతదేహం

తొగుట, మార్చి 3: అప్పుల బాధతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కాన్గల్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. తొగుట పోలీసులు, గ్రామస్థుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ముచ్చర్ల కనకయ్య (35) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు అతడికి భార్య వాణి(25) కొడుకు సాత్విక్(6), కూతురు ప్రియాన్సిత(1) సంతానం. కుటుంబ పోషణ కోసం కనకయ్య దాదాపు రూ.4 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పు తీర్చే మార్గం తోచక తీవ్ర మనస్థాపానికి గురై గత నెల 29న తన ఇంట్లో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్న కనకయ్య ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తొగుట ఏఎస్ఐ జీడిపల్లి రాంరెడ్డి వెల్లడించారు.

దొంగతనం కేసులో నిందితుల రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రఘుపతి

రాయపోల్, మార్చి 3: దొంగతనం కేసులో రాయపోల్ పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఎస్ఐ రఘుపతి వివరాల ప్రకారం.. రాయపోల్‌కు చెందిన తుప్పతి లక్ష్మి గత నెల 28 ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లింది. అదే రోజు రాత్రి దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి రూ. 60 వేలు, 50 తులాల వెండి కడియాలను దొంగిలించారు. మరునాడు ఉదయం ఇంటికి వచ్చిన బాధితురాలు చోరీ జరిగినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల విచారణలో రాయపోల్ గ్రామానికి చెందిన తుప్పతి కనకయ్య, కుమ్మరి లింగంలను నిందితులుగా గుర్తించి అరెస్టు చేశారు. వారి నుంచి రూ.32వేలు, 50 తులాల వెండి కడియాలను స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు పంపించామని ఎస్ఐ వివరించారు.

గజ్వేల్ ఏసీపీగా పురుషోత్తంరెడ్డి



గజ్వేల్, మార్చి 3: గజ్వేల్ ఏసీపీగా పనిచేస్తున్న ఎ.బాలాజీని బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ రవిగుప్తా ఉత్తర్వులను జారీ చేశారు. ఆయన స్థానంలో మల్కాజిగిరి ఏసీపీగా పనిచేస్తున్న కె.పురుషోత్తంరెడ్డిని బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఐదేళ్ల ఒకే పార్లమెంట్ పరిధిలో పనిచేస్తున్న పోలీస్ అధికారులను బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ క్రమంలో సిద్దిపేట, సంగారెడ్డిలలో పనిచేసిన బాలాజీ బదిలీ అనివార్యమైంది. కాగా పురుషోత్తంరెడ్డి నేడు బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.

చదువుతో సమాజంలో మంచి గుర్తింపు


విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు, మార్చి 3: చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని, విద్యార్థులు బాగా కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ ఆకాంక్షించారు. శనివారం రాత్రి చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతీ విద్యార్థి చిన్నప్పటి నుంచే ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ఆ దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, ఎంఈవో దేశిరెడ్డి, ఎంపీటీసీ దుర్గారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గుండారెడ్డి పల్లెకు ఆర్టీసీ బస్సు పునరుద్ధరణ


కోహెడ, మార్చి 3: మండలంలోని గుండారెడ్డిపల్లికి కరీంనగర్ నుంచి ఆర్టీసీ బస్సు సేవలు ఆదివారం పునరుద్ధరించారు. గతంలో కరీంనగర్ నుంచి గుండారెడ్డిపల్లికి కొన్నేళ్లపాటు ఆర్టీసీ బస్సు నడిచింది. ఏడాది క్రితం బస్సును నిలిపివేశారు. ఇటీవల కాంగ్రెస్ నాయకుడు జాప రాజిరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి బస్సు సర్వీసును పునరుద్ధరించాలని వినతి పత్రం సమర్పించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి పొన్నం ఆర్టీసీ మేనేజర్‌తో మాట్లాడి బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ఆదేశించారు. బస్సు సౌకర్యం కల్పించిన మంత్రికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీనివాస్‌కు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు


అవార్డును అందుకుంటున్న కూరాకుల శ్రీనివాస్

గజ్వేల్, మార్చి 3: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును గజ్వేల్ పట్టణానికి చెందిన కూరాకుల శ్రీనివాస్ ఆదివారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన దక్షిణ భారత దేశ బహుజన రైటర్స్ 7వ తెలంగాణ కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డును బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుబ్రహ్మణియన్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎం.గౌతమ్ చేతుల మీదుగా కూరాకుల శ్రీనివాస్ ఈ అవార్డును అందుకున్నారు. సౌత్ ఇండియాకు చెందిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, ఒరిస్సా, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి సుమారుగా 600మందికి పైగా డెలిగేట్స్ ఈ కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. కాగా అవార్డును అందుకున్న శ్రీనివాస్‌కు టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ, రాష్ట్ర కార్యదర్శి కల్వాల్ శ్రీకాంత్, కోశాధికారి నరేశ్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మ్యాన పవన్‌కుమార్, వెంకటేశ్ శుభాకాంక్షలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పుల్లూరు పాఠశాల పూర్వ విద్యార్థులు

సిద్దిపేటరూరల్, మార్చి 3: మండలంలోని పుల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2003-04లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. 20 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు పరస్పర యోగక్షేమాలను తెలుసుకుంటూ, పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్య నేర్పిన గురువులతో పాటు ప్రస్తుతం పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.